
ప్రజాశక్తి
సోమవారం 15 జనవరి 2024



తిరుపతి


చిత్తూరు

పల్లెల్లో సం(క్రాంతి)దడి

ప్రజాశక్తి- నగరి: ప్రాచీన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ సంక్రాంతి పండుగ రానే వచ్చింది. ఉత్తరాయణ పర్వదినాల్లో సూర్యుడు మకరరాశిలోకి సంక్రమణం చేసే పర్వదినాన్ని మకరసంక్రాంతిగాను, దాని ముందురోజు భోగి, కనుమ జరుపుకుంటారు. ఈ రోజులు పవిత్ర దినాలుగా భావించి ప్రజలు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. సంక్రాంతి సందడితో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఆహ్లాదకర వాతావరణమే దర్శనమిస్తుంది. నగరి మండలం తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో ఇక్కడ జరిపే సంక్రాంతి పండుగ రెండు సంస్కృతుల సమ్మేళనంగా ఉంటుంది. సరిహద్దు ప్రాంతాలలో అధిక సంఖ్యలో తమిళ సంప్రదాయాలు పాటించే నేత సామాజిక వర్గంవారు ఉన్నారు. వీరు సంక్రాంతి పండుగను 'పొంగల్' పేరుతో జరుపుకుంటారు. 'పొంగల్' అంటే పొంగలి అని అర్థం. తమిళంలో 'తై' అనే పేరుగల నెల పుట్టే రోజునే సంక్రాంతి పండుగ వస్తుంది. ఆ రోజున వారు కొత్తదనానికి స్వాగతం పలుకుతారు మట్టితో ఇళ్లవద్దే స్వయంగా పొయ్యి తయారు చేసుకొని వాటిని ఎండబెట్టుకుంటారు. ఆ పొయ్యిపై కొత్త మట్టికుండ తెచ్చి బొట్టుపెట్టి పసుపుకొమ్ము చుడతారు. కోతకోసిన వడ్లను దంచి ఆ బియ్యాన్ని కుండలో వేసి పొంగలి చేస్తారు. పొంగలి, చెరుకుగెడలు, కొత్తబట్టలు పెట్టి పంట రావడానికి సహకరించిన సూర్యుడికి పూజలు చేస్తారు. వ్యాపారాలకు సంబంధిత నూతన ఖాతాలను ఆరోజు నుంచే ప్రారంభిస్తారు. తమ వద్ద పనిచేసే వారికి అక్కడే నేసిన పంచలు, చీరలు అందిస్తారు. రెండు రోజుల ముందు నుంచే ప్రతి ఇంటి ముందు మహిళలు పొయ్యి తయారు చేసి అరుగులపై ఎండబెట్టారు. పల్లెల్లో పండుగను పురస్కరించుకొని డూడూ బసవన్న ఇంటింటికీ

8లో



నారావారిపల్లెలో సంక్రాంతి శోభ

- చంద్రబాబు, లోకేష్ లకు ఘన స్వాగతం - నాని ఆరోగ్యం పరిస్థితి పై ఆరా తీసిన బాబు
- ప్రభుత్వ జీవోలు దగ్ధం - సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి



2లో

ప్రభుత్వ జీవోలు దగ్ధం చేస్తూ నిరసన తెలుపుతున్న బాబు కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు

భోగిలో అంగన్‌వేడి

- మంటల్లో నోటీసులు దగ్ధం - 34వ రోజు సమ్మె - శిబిరాల్లో హోరెత్తిన నినాదాలు



2లో

కుప్పంలో నోటీసులను భోగి మంటల్లో వేస్తున్న అంగన్వాడీలు

భోగిలో అంగన్‌వేడి

- మంటల్లో నోటీసులు దగ్ధం
- 34వ రోజూ సమ్మె
- శిబిరాల్లో హోరెత్తిన నినాదాలు
- గొబ్బెమ్మ పాటలతో ప్రభుత్వానికి నిరసనలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె ఆదివారం 34వ రోజుకి చేరింది. చిత్తూరు జిల్లాలో కుప్పం, శాంతిపురం, బైరెడ్డిపల్లి, పలమనేరు, కార్వేటినగరం, నగరి వరకు అన్ని ప్రాజెక్టు కార్యాలయం శిబిరాలు వద్ద భోగి పండుగ రోజు భోగిమంట వేసి నోటీసులను దగ్ధం చేసి గొబ్బెమ్మలు పెట్టి పాటలు పాడారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత, జిల్లా కార్యదర్శి షకీలా, జిల్లా ఉపాధ్యక్షురాలు మమత, పంచవర్ణ , శ్యామల పద్మలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టిన అలుపెరుగని పోరాటం చేస్తున్న అంగన్వాడీలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబం మొత్తం ఆనందంగా భోగి పండుగ చేసుకోవాల్సిన సందర్భంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వలన శిబిరాల వద్ద అంగన్వాడీలు భోగి పండుగ చేసుకోవలసిన దుర్భిక్ష పరిస్థితికి తీసుకువచ్చింది. సంక్రాంతి, కనుమలు కూడా శిబిరాల వద్ద చేసుకుంటామని అప్పటికైనా ప్రభుత్వానికి సిగ్గు రావాలని అన్నారు. లక్ష పదివేల మంది మహిళలు రోడ్ల మీదే పండుగలు చేసుకుంటుంటే ముఖ్యమంత్రి కుటుంబం మాత్రం పండగ సంబరాల్లో మునిగితేలుతున్నారని, ఒక్కసారి ఛాన్స్ ఇవ్వండి అని అడిగినందుకు మాకు తగిన బుద్ధి చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరూ కుటుంబం మొత్తం ఆనందంగా జరుపుకునే పండుగను అంగన్వాడీల కుటుంబాలను మాత్రం వీధులు పాలు చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని తెలిపారు. ఇప్పటికైనా పోరాటం ఉదతం కాకముందే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమాలలో ఆయా ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న అంగన్వాడీలు భోగి మంటలు వేసి ముగ్గుల రూపంలో సమస్యలు తెలియజేసి పోరాటాన్ని కొనసాగించారు.

పండగ పూట కూడా పచ్చిపులుసే గతి..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సంక్రాంతి పండగ పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు నిరాశే మిగిల్చింది. జీతాలు పెంచకపోవడం పండగపూట అంగన్వాడీలు పస్తులతో గడపాల్సి వచ్చింది. అంగన్వాడీల పోరాటం నేడు ఆదివారానికి 34వ రోజుకు చేరుకుంది. మొన్న జరిగిన చర్చలు విఫలం కావడంతో కోటి సంతకాలకు రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. అందులో భాగంగా భోగి పండుగ రోజున అంగన్వాడీ దీక్షా శిబిరం ముందు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి నగర ప్రధానకార్యదర్శి కే.వేణుగోపాల్ మాట్లాడుతూ అంగన్వాడీలు 34 రోజులుగా పోరాడుతున్న పట్టించుకోని దుర్మార్గమైన ప్రభుత్వానికి పుట్టగతులు లేకుండా చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కోటి సంతకాలే కాదు రెండు కోట్ల కైనా సంతకాలను సేకరించి ప్రజామద్దతుతో అంగన్వాడీల పోరాటం ప్రజా బహుళయమైన పోరాటంగా దీన్ని మారుస్తామన్నారు. సిఐటియు నాయకులు తంజావూర్ మురళి, అంగన్వాడీలు సుజిత, వరలక్ష్మి, ఎల్లమ్మ, గంగాదేవి సుశీలమ్మ, మల్లార్ కోడి, కల్పనా, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు టిడిపి జనసేన నాయకులు ఆదివారం సంఘీభావం తెలియజేశారు. టిడిపి మహిళా విభాగం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు చక్రాల ఉష, జనసేన నాయకులు అంజూరు చక్రధర్, సీఐటీయూ నాయకులు పెనగడం గురవయ్య, రేవతి పాల్గొన్నారు. రేణిగుంట మంచినీళ్ళ గుంట పాత ఎమ్మార్వో ఆఫీస్ వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద ఆదివారం 34వ రోజు భోగి మంటల్లో ఎస్మా జీవో నెం .2, ఉద్యోగాల్లో చేరాలని ఇచ్చిన సోకాజ్ నోటీసులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. గూడూరు పట్టణంలోని అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు ఏ.ఇంద్రావతి, కార్యదర్శి బిఎస్. ప్రభావతి, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు నాయకులు భోగి మంటల్లో ఎస్మా కాపీలను, సోకాజ్ నోటీసులను వేసి నిరసన తెలిపారు. అలాగే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పుత్తూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో పండగపూటలో మట్టి తిని బ్రతకాలా జగనన్న అంటూ అంగన్వాడీలు సమ్మె శిబిరం వద్ద మట్టి తింటూ నిరసన తెలిపారు. నాయుడుపేట ఐసిడిఎస్ వద్ద ఆదివారం అంగన్వాడీలు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి, ముకుందా అంగనవాడి ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.శ్యామలమ్మ పాల్గొన్నారు.


కార్వేటినగరంలో


నగరిలో



గూడూరులో


రేణిగుంటలో

నారావారిపల్లెలో సంక్రాంతి శోభ..

చంద్రబాబు, లోకేష్‌లకు ఘన స్వాగతం...
నాని ఆరోగ్యం పరిస్థితి పై ఆరా తీసిన బాబు
ప్రభుత్వ జీవోలు దగ్ధం సాంస్కతిక కార్యక్రమాలతో సందడి

ప్రజాశక్తి- రామచంద్రపురం:

తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, నారావారిపల్లెలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంక్రాంతి పర్వదినాన్ని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామం నారావారిపల్లెలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఉండవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో ఆయన, నారా లోకేష్ ఇద్దరు ఏ.రంగంపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, నందమూరి హరికష్ణ, బాలకష్ణ సతీమణి వసుంధర, నారా దేవాన్ష్ రెండు రోజుల క్రితమే నారావారిపల్లెకు చేరుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లకు ఘన స్వాగతం లభించింది. చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి, తనయుడు పులివర్తి వినీల్ పుష్పగుచ్చం అందజేసి దుశ్శాలువతో సత్కారించారు. దొంగ ఓట్లు ఏరివేతకు ఆమరణ నిరహార దీక్ష చేస్తుండగా జరిగిన ఘటనలో పెట్రోల్ పైన పడి తీవ్రంగా గాయపడిన పులివర్తి నాని ఆరోగ్య పరిస్థితిని నారా లోకేష్ అడిగి తెలుసుకున్నారు.


నారావారిపల్లెలో చంద్రబాబు

సుధారెడ్డి, వినీల్‌లకు ధైర్యం చెప్పి, గుండె నిబ్బరంతో పోరాడాలని చెప్పారు.


ప్రభుత్వ జీవోలు దగ్ధం..

నారావారిపల్లెలో భోగి మంటల్లో ప్రభుత్వ జీవోలు దగ్ధం చేశారు. నందమూరి వసుంధర, నందమూరి రామకష్ణ, పులివర్తి సుధారెడ్డిలు, చంద్రబాబు సోదరి హైమావతిలు జీవో నెం1, ఎస్మా, ఇన్నరింగ్ రోడ్డు, లికర్స్, శాండ్, స్కిల్ డెవలప్మెంట్ ఎఫ్ఐఆర్ కాఫీలు తగులబెట్టి వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సాంస్కతిక కార్యక్రమాలతో సందడి..

నారావారిపల్లెలో సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హరిదాసు కీర్తనలు, ముగ్గుల పోటీలు, ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొంది. ఆటపాటల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ప్రధానం చేశారు. చంద్రబాబు నాయుడు రాకతో నారావారిపల్లి గ్రామంలో సందడి చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ కష్ణారెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎసివి నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన్ శ్రీధర్ హేమాంబరధరరావు స్థానిక నాయకులు కలిసి పుష్పగుచ్చాలు అందించి భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నర్సింగాపురం నుంచి నారావారిపల్లి వరకు రహదారికి ఇరుపక్కల తెలుగుదేశం పార్టీ శ్రేణులు బాబుకు స్వాగతం పలుకుతూ భారీ కటౌట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

మహానగరాలకు దీటుగా 'చిత్తూరు'


నగరపాలక కమిషనర్ అరుణ

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: స్వచ్ఛసర్వేక్షన్ రాష్ట్రస్థాయిలో చిత్తూరు కార్పొరేషన్ 9వ ర్యాంకు సాధించడం జరిగింది. జాతీయ స్థాయిలో 446 నగర పాలక సంస్థలో 446 ర్యాంకులో నిలిచింది. 22 ఏడాదితో పొల్చితే చిత్తూరు జిల్లా పది స్థానాలు ముందున్నది. రాష్ట్రస్థాయిలో 31 నగరాలతో పోటీపడుతూ 9వ స్థానంలో నిలిచింది. స్వచ్ఛ సర్వేక్షన్‌లో గత ఏడాది ర్యాంకు 153 కంటే 10 ర్యాంకులు మెరుగుపరచుకుంది. గత ఏడాది 382 నగరాలు పోటీ పడగా, ఈ ఏడాది 446 నగరాలు పోటీపడ్డాయి. జనాభా పరంగా మనకంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలతో దీటుగా పోటీపడుతూ.. పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ నిర్వహణ, ఓడిఎఫ్ ప్లస్, సిటిజన్ ఫీడ్బ్యాక్ కేటగిరీలో గతంలో కంటే మెరుగైన మార్కులు సాధించింది. 2022లో 3,433.86 మార్కులు సాధించగా.. 2023లో 5,174.45 మార్కులు సాధించింది. అమృత్2.0లో భాగంగా సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు మంజూరయ్యాయి. ఇవి పూర్తై అందుబాటులోకి వేస్తే మహానగరాలకు దీటుగా మరింత మెరుగైన ర్యాంకు సాధించే అవకాశం ఉంది. స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో మెరుగైన ఫలితాలు సాధించడంపై నగర కమిషనర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వూలో..

ప్రజాశక్తి: నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలెలా ఉన్నయి..?

కమిషనర్: నగర పాలక సంస్థ పరిధిలో 50 డివిజన్లున్నాయి. పర్మినెంట్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ క్రింద పారిశుధ్య కార్మికులు 360 మంది పని చేస్తున్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది 70 మంది వరకు పని చేస్తున్నారు. క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా ఎప్పటి చెత్త అప్పుడే తొలగించేలా చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇంటింటా చెత్త సేకరణ సమర్ధవంతంగా నిర్వహించడం జరుగుతోంది.

ప్రజాశక్తి : నగరంలో తాగునీటి సమస్య ఉందా..?

కమిషనర్: ఎన్‌టిఆర్ జలాసయంలో గతేడాది నుండీ వర్షాలతో నీటి మట్టం బాగా ఉంది, అలాగే భూగర్భ జలమట్టం పెరగడంతో మోటరు బోర్ల నుండీ నీటి సరఫరా చేయడం జరుగతోంది. చిత్తూరుకు తాగునీటి శాశ్వత పరిష్కరం కోసం పైపులైన్ పనులు జరుగుతున్నాయి. అడవిపల్లి రిజర్వాయర్ నుండీ చిత్తూరు తాగునీటిని తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది.

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి : స్వచ్ఛసర్వేక్షన్ ర్యాంకుల పట్ల మీ అభిప్రాయం..?

కమిషనర్: స్వచ్ఛసర్వేక్షన్‌లో చిత్తూరు నగర పాలక సంస్థకు సంతృప్తి కరంగా రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు రావడం జరిగింది. గ్రీనరీ పెంపు కోసం కట్టమంచి, గంగినేని చెరువుల వద్ద గ్రీనరీ పెంపు కోసం చర్యలు తీసుకోవడం జరిగింది. అలాగే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నాం.

ప్రజాశక్తి : ఇరుకైన రోడ్లు విస్తరణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

కమిషనర్: చిత్తూరు నగరంలో ప్రధానంగా కట్టమంచి నుండీ కొత్త కలెక్టరేట్ వరకు ఉన్న రోడ్డును విస్తరించాల్సి ఉంది. భవన యజమానులతో పలుదఫాలు చర్చలు జరిపాం సహకరించాలని కోరడం జరిగింది. గాంధీ విగ్రహం వద్ద డివైడర్లను ఏర్పాటు చేయడంతో పాలు చేశాం.

ప్రజాశక్తి : కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలెలా ఉన్నాయి..?

కమిషనర్: కార్పొరేషన్ పరిధిలో వరదల నుండీ నీవానది సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలు సురక్షితంగా ఉండేలా నీవానదిలో జేసిబిల ద్వారా శుభ్రం చేయడంతో పాటు లోతును పెంచడం జరిగింది. మురికివాడల్లో సీసీ రోడ్లు వస్తున్నాం. కార్పొరేషన్ పరిధిలో చేపట్టే ప్రతి పని టెండర్ల ద్వారా ఖరారు చేయడం జరుగుతోంది.

పట్టుకో.. పట్టుకో..

- జనసంద్రంగా మారిన అనుపల్లి
- అలరించిన పశువుల పండుగ

ప్రజాశక్తి-రామచంద్రపురం: సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం అనుపల్లి గ్రామంలో పశువుల పండుగ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జల్లికట్టు కార్యక్రమానికి పశువుల యజమానులు తమ కోడె గిత్తలు, పశువుల కొమ్ములను నునుపుగా చెక్కి, కొమ్ములకు రంగులు పూసి అందంగా తీర్చిదిద్దారు. అనంతరం గ్రామంలో ఎదురు తడికలతో ఏర్పాటు చేసిన దొడ్లల్లో పశువులను నిర్బంధించారు. పశువుల కొమ్ములకు తమ అభిమాన రాజకీయ, సినిమా నటుల ఫోటోలతో చెక్క పలకలు తయారు చేసి, వివిధ రకాల రంగు కాగితాలతో, నెమలీకలతో అలంకరించి కుమ్ములకు కట్టారు. పశువులకు పసుపు కుంకుమ పెట్టి, పూలమాలతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు, పశువులు, కోడెగిత్తలను గుంపులు గుంపులుగా డబ్బులు టపాకాయలు పేల్చి బెదిరిస్తూ జల్లికట్టులోకి ప్రవేశింపజేసేందుకు సిద్ధం చేశారు. కోడె గిత్తలు రంకేసి, కాళ్ల దువ్వాయి. దీంతో యువకులు వాటిని పట్టుకునేందుకు హుషారుయ్యారు. ఆ తరువాత డప్పులు వాయిస్తూ, యువకులు కేరింతలు కొడుతూ గుంపులు గుంపులుగా కోడెద్దులను తరిమారు. పట్టుకో.. పట్టుకో అంటూ ఎద్దులను నిలువరించేందకు ప్రయత్నించారు. జల్లికట్టును తిలకించేందుకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి జనం అధికంగా తరలివచ్చారు. దీంతో అనుపల్లి గ్రామం జనసంద్రంగా మారింది. సాయంత్రం నాలుగు గంటల వరకూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జల్లికట్టు సాగింది.



అనుపల్లిలో ఎద్దులను నిలువరిస్తున్న యువకులు

పందేలు జోరు.. తప్పని బేజారు.!

- అధికారుల ఆంక్షలు కాంక్షలుగానే మిగిలాయి
- ఉమ్మడి జిల్లాలో జోరుగా జల్లికట్టు
- హెచ్చరికలకే పరిమితమైన పోలీసులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: జల్లికట్టు, కోడిపందేలు, జూదం ఆడితే చట్టపరమైన చర్యలు చేపడతామని గ్రామాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. వారం రోజులుగా అవగాహన కల్పిస్తూ, బైండోవర్ చేశారు. అయినా జల్లికట్టు నిలువరించడంలో పూర్తిగా వైఫల్యం చెందినట్లే తెలుస్తోంది. పందేలు అడ్డుకొనేందుకు తహశీల్దార్, స్థానిక పోలీసులు, జంతు సంక్షేమ బోర్డు సభ్యులతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. అయినా సాంప్రదాయ బద్ధంగా వస్తున్న జల్లికట్టు అడ్డుకోవడం అధికారులకు సాధ్యపడలేదు. అసలే ఎన్నికల వేళ అటు రాజకీయ పార్టీల నుంచి గ్రామీణులకు ప్రోత్సాహం ఉన్నట్లు తెలుస్తోంది. పందేలతో యువతను ఆకర్షించుకొనే పనిలో అధికార పార్టీ నేతలు జోక్యం ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా యదావిధిగా గ్రామాల్లో భోగి పండుగ రోజున జల్లికట్టు జరిగింది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - దొరవారిసత్రం: రోడ్డుప్రమాదంలో ముగ్గురు యువకులు మతి చెందిన సంఘటన తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని కలగుంట జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఆదివారం తెల్లవారుజామున ఏకొల్లు గ్రామానికి చెందిన గౌతమ్ (23), నాయుడుపేట మండలం అట్లపాలెం గ్రామానికి చెందిన మునిరత్నం (29), పెళ్లకూరు మండలం జీలగపాటూరు గ్రామానికి చెందిన కోగిలి రాంకి (24) ముగ్గురు యువకులు ఏకోలు గ్రామం నుండి ద్విచక్రవాహనంపై నాయుడుపేట వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో గౌతమ్, రాంకీ సంఘటనా స్థలంలోనే మరణించారు. సమాచారం తెలుసుకున్న సీఐ జగన్మోహన్ రావు, ఎస్ఐ తిరుమలరావు సంఘటన స్థలానికి చేరుకొని ప్రాణాపాయస్థితిలో ఉన్న మునిరత్నంను 108 వాహనం ద్వారా నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మునిరత్నం చికిత్స పొందుతూ మతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: టిప్పర్ ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వేణుగోపాలపురం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..వరదయ్యపాళెం మండలం కాంభాగం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని ఎం నరేష్ (23) కొంతకాలంగా రోడ్లపై తిరిగేవాడని ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో వేణుగోపాలపురం వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో టిప్పర్ ఢీకొందని తెలిపారు. విపరీతమైన పొగ మంచు కారణంగా టిప్పర్ డ్రైవర్‌కు రోడ్డుపై కనిపించకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుందన్నారు. స్థానికుడు రాజేష్‌నాయుడు అందించిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. టిప్పరు డ్రైవర్ తుకారాంను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు రూరల్ మండల పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. గూడూరు రూరల్ మండల పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో పంచరు దుకాణం సమీపంలో మహారాష్ట్రకు చెందిన సుధా సాహు , కమలేష్ సాహు దంపతులు 3 నెలల నుండి అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. మృతిరాలి భర్త లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నారు. ఆయన పనులు నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి రాగానే భార్య ఉరి వేసుకొని చనిపోయింది ఉంది. దీంతో రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. హుటా హుటిన రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని స్కూటరిస్టు మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): విద్యుత్ స్తంభాన్ని ఢీకొని స్కూటరిస్టు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చంద్రగిరి మండలం అగరాల పంచాయతీ బండకాడపల్లి గ్రామానికి చెందిన విజయ్ కుమార్(25) పాత శానంబట్ల లోని గజేంద్రకు చెందిన టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో గజేంద్ర ఫోన్ చేసి విజయ్ కుమార్‌ను పాతశానంబట్లకు రావాలని కోరటంతో విజయకుమార్ తన ద్విచక్ర వాహనంపై పాతశానంబట్లకు వెళ్లి తిరిగి బండకాడపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యం తొండ వాడ బైపాస్ రహదారి శ్లోక ఓం బిర్లా పాఠశాల సమీపంలో అతివేగంగా వస్తూ రహదారి పక్కనే వున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై విజయ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న విజయ్‌కుమార్ భార్య లక్ష్మి ప్రియ సంఘటనా స్థలం వద్దకు చేరుకొని బోరున విలపించింది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ హిమ బిందు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్‌వి వైద్య కళాశాలకు తరలించారు. మృతు నికి భార్య, ఓ బాబు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచర్స్ అరెస్ట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రూరల్ పరిధిలో ఒంటరి మహిళల మెడలో బంగారు గొలుసులను అపహరించిన ఇద్దరు యువకులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. గూడూరు రూరల్ సిఐ వేణు గోపాల్ రెడ్డి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గూడూరు రూరల్ పరిధిలోని మధు రెడ్డి కాలనీ లో గత సంవత్సరం ఆరు బయట నిద్రిస్తున్న మహిళ మెడలో గొలుసులను అపహరించారన్నారు. ఒంటరిగా వున్న మహిళ మెడలో గొలుసులు దొంగతనం చేస్తున్న చిట్టేటి అనిల్ కుమార్, సంక్రాంతి శ్రీనివాసులును గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో అరెస్ట్ చేశామన్నారు. నిందితుల వద్ద నుండి నుండి 9 లక్షల విలువచేసే 142 తులాల బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ దొంగలు అరెస్ట్

22 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-వీకోట: అంతరాష్ట్ర బైక్ దొంగలను అరెస్టు చేసి 22బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన వీకోటలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీఎస్పీ మాట్లాడుతూ కేజిఎఫ్‌రోడ్ లోని పత్రపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బందికి కర్ణాటక రాష్ట్రం కేసంబళ్ళ హోబ్లి, చిన్న కొత్తూరుకు చెందిన కుమార్, వీకోట మండలం బంగ్లావూరుకు చెందిన పవన్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని పరిశీలించి అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ విషయం బయటపడిందన్నారు. వీరిద్దరూ చెడు వ్యసనాలకు బానిసలై ఆంధ్ర కర్ణాటక తమిళనాడు ప్రాంతాల్లో 22ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసిందన్నారు. వీరి వద్ద స్ప్లెండర్ వాహనాలు -9, ఫ్యాషన్ ప్రో -7, హోండా యాక్టివా -2, హోండా డియో -1, బజాజ్ డిస్కవర్ -1, హోండా షైన్ -1, టీవీఎస్ ఎక్సెల్ -1, మొత్తం 22 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటి విలువ రూ. 20లక్షలు ఉంటుందని డిఎస్పి సుధాకర్ రెడ్డి వివరించారు. చోరీ చేసిన వాహనాలను వీకోటకు చెందిన సలీం, సుబ్రహ్మణ్యంలకు విక్రయించే వారిని విచారణలో తేలిందన్నారు. నిందితులు ఇద్దరితో పాటు వాహనాలను కొనుగోలు చేసి విక్రయించిన ఇద్దరి పైనకూడా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు విలేకరులకు వివరించారు. చురుగ్గా పనిచేసిన పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ట్రాన్స్‌ఫార్మర్ దొంగలను అదుపులోకి తీసుకొని వారి నుండీ ఎనిమిది లక్షల విలువగల కాపర్ వైర్లను చిత్తూరు తాలూకా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా యన్.ఆర్.పేట పోలీసు స్టేషనులో నమోదైన ట్రాన్స్‌ఫార్మర్ అపహరించిన కేసులలోని దొంగల గురించి వచ్చిన ఖచ్చితమైన సమాచారం మేరకు యన్.ఆర్.పేట పోలీసు స్టేషను సబ్ ఇన్స్పెక్టర్ .సుబ్బమ్మ , చిత్తూరు తాలూక ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, జి.డి.నెల్లూరు ఎస్ఐ రామాంజినేయులు, చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ క్రైమ్ సిబ్బంది బృందంగా ఏర్పడి చిత్తూరు-తిరుత్తణి రోడ్డు మీద, కుర్చివేడు క్రాస్ వద్ద జిల్లాకు చెందిన నలుగురు, తమళనాడుకు చెందిన ఇద్దరు ట్రాన్స్‌ఫర్మార్ దొంగలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ముద్దయిల్లో సూర్య, దినేష్, ఆదిత్య, ప్రవీణ్‌కుమార్, అలి అబాస్, శివలింగం ఉన్నారు. అదుపులోకి తీసుకున్న ముద్దాయిలను రిమాండ్ తరలించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక అశోకపురం వీధిలోని గోనెసంచులతో అనుమాన స్పందంగా తిరుగుతున్న లోకేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లోకేష్ ఇచ్చిన సమాచారం మేరకు రెండు లక్షల విలువ చేసే కర్నాటక మద్యంతో పాటు ఓ కారును స్వాదీనం చేసుకున్నారు. నిందితుడు అందించిన సమాచారంతో చిత్తూరు నగరంలో కొందరు కర్నాటక మద్యం తీసుకొచ్చి చిత్తూరులో అమ్ముతున్నారని మరికొంత మందిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఆయన తెలిపారు. స్థానిక వన్‌టౌన్‌లో స్వాదీనం చేసుకున్న టెర్రా ప్యాకెట్లు, నిందితుడి అరెస్టును డిఎస్‌పి మీడియాకు చూపించారు. ఈ సమావేశంలో సిఐ విశ్వనాధరెడ్డి, ఎస్ఐ మళ్లికార్జున పాల్గొన్నారు.






భోగి పండుగ సందర్భంగా పొగతో కమ్మేసిన తిరుపతి నగరం













శ్రీవారి ఆలయంలో నేటి నుండి సుప్రభాత సేవ పునః ప్రారంభం

రేపు పార్వేట ఉత్సవం

ప్రజాశక్తి- తిరుమల: ధనుర్మాసం ఆదివారంతో ముగియడంతో నేటి నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ పునఃప్రారంభం కానుంది. గత ఏడాది డిసెంబర్ 17న తెల్లవారు జామున 12.34 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కావడంతో శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. జనవరి 14వ తేది ధనుర్మాస ఘడియలు పూర్తికానుండడంతో 15 నుంచి యథాప్రకారం శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ నిర్వహిస్తారు. భక్తులు ఈ విషయాన్ని గమనించవలసిందిగా టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. అదేవిధంగా ఈ నెల 16న ఉదయం శ్రీవారి ఆలయంలో గోదా పరిణయోత్సవం, మధ్యాహ్నం పార్వేటమండపం వద్ద పార్వేట ఉత్సవం జరగనున్నాయి.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

తెలిపిన మంత్రులు, అధికారులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో, భోగభాగ్యాలతో, సిరి సంపదలతో తులతూగాలని, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎక్సైజ్, జిల్లా ఇంచార్జి మంత్రి కె.నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్తు, అటవీ భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రాష్ట్ర పర్యాటక, యువజన క్రీడా శాఖా మంత్రి ఆర్కె. రోజా, చిత్తూరు తిరుపతి ఎంపీలు రెడ్డప్ప, మద్దిల గురుమూర్తి, జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, ఎస్పి పరమేశ్వర్ రెడ్డి, శాసన సభ్యులు, జేసి శుభం బన్సల్, డిఆర్ఓ పెంచల కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మకర సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలందరూ సహద్భావ వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని, అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తున్నామని వారు ఆ ప్రకటనలో తెలిపారు.













సమాజ దార్శనికులు కవులు

అలరించిన సంక్రాంతి కవి సమ్మేళనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కవులు, రచయితలు సమాజంలోని పలు అంశాల పట్ల దూరదృష్టితో ఆలోచించి రాసే సమాజ దార్శనికులని విశ్రాంత ప్రిన్సిపాల్ లగడపాటి కిరణ్మయి అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి అధ్యక్షతన సంక్రాంతి కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్మయి మాట్లాడుతూ నాన్న లగడపాటి భాస్కర్ లేని లోటు పూడ్చలేమనీ, ఆయన రచనలు చిరస్మరణీయమంటూ కొనియాడారు. నాన్న పేరుతో ఇద్దరి సాహితీ వేత్తలకు సాహితీ పురస్కారం అందిస్తామని ప్రకటించారు. అనంతరం పలువురు కవులు సంక్రాంతి విశిష్టత గురించి, పతనమై పోతున్న సంస్కృతి, సామాజిక విలువలు, తెలుగు భాషా వైభవం వంటి అంశాలపై తమ స్వీయ కవితలు వినిపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు చంద్రబాబు, వేదిక కార్యవర్గ సభ్యులు తీగల వెంకటయ్య, గురునాథం, గణేష్, బాలముని శివకుమార్, పెళ్ళకూరు సుబ్బారెడ్డి, కళాకారులు పిళ్ళారి బత్తినయ్య, సున్నపు లక్ష్మయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.



సంక్రాంతి కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రభుత్వ హాస్పిటల్‌లోని ప్రసూతి కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం బేబీ కిట్లను క్లబ్ సభ్యులు అందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో గూడూరు ప్రభుత్వ హాస్పిటల్ లోనే ప్రసూతి కేంద్రంలో ప్రసవం అయిన తల్లులకు పౌష్టికాహారం బేబీ కిట్లను క్లబ్ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమానికి దాత గా మురళి నాయుడు వ్యవహరించారు. ఈ సందర్భంంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా లయన్స్‌క్లబ్ ఆఫ్ వైజేపి ఆధ్వర్యంలో బేబీ కిట్ల పంపిణీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి, అర్‌వి రావు, రవీందర్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

టిడిపిలోకి 80 కుటుంబాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని కొండాగుంట గ్రామం నుండి 80 కుటుంబాలు టిడిపిలో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండగుంట గ్రామం నుండి మాజీ సర్పంచ్ బత్తల శ్రీనివాసులు రెడ్డి, మల్లారెడ్డి ఆధ్వర్యంలో కృష్ణ రెడ్డి, రమణయ్య, బాలయ్య , రాధయ్య, మనేయ్య, ఉప సర్పంచ్ లు, ఎంపిటిసిలు వార్డు మెంబర్లు, యువత పార్టీలో చేరడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. వారి చేరికతో కొండగుంట గ్రామం మొత్తం టీడీపికి బలం పుంజు కుంటుందన్నారు. కొండ గుంట గ్రామంలో టిడిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప ఈ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కారణంగానే టిడిపిలో చేరామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పారీ రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్ల రాజు,జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, మాజీ కౌన్సిలర్ వాటంబేటీ శివకుమార్, శంకర్ రెడ్డి, పెంచల్ రెడ్డి,ముమ్మడి అమరేంద్ర, మండల నాయకులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- చిన్న గొట్టిగల్లు: సంక్రాంతి సందర్భంగా మండల టిడిపి నాయకులు క్రికెట్ టోర్నమెంట్ ను స్థానిక బి దార్లపల్లి పంచాయతీ లో నిర్వహించారు. ఆటను మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్వి రమణా రెడ్డి, మునస్వామి నాయుడు, కుమారస్వామిరెడ్డి, మున్నా, కాదరవల్లి, ఇతర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు వద్దు.. మహిళల అభ్యర్థన

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరులో మూడు చోట్ల మద్యం బెల్టు షాపులను నిర్వహిస్తుండటంతో మహిళలు ఆందోళన తమకు వద్దని అభ్యర్థిస్తున్నారు. గ్రామంలో మద్యం బెల్టుషాపులు ఉండటంతో మందుబాబులు మద్యం సేవించి గొడవలు చేస్తుండటంతో భయందోళనకు గురి అవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. కరకం బట్టు, నేరిణికండ్రిగ. కుక్కంబాకం గ్రామాలకు చెందిన మందుబాబులు సైతం ఇక్కడకు వచ్చి మద్యం సేవిస్తున్నారని, దీంతో గ్రామంలో ప్రశాంతత కరువైందని అంటున్నారు. బెల్టుషాపులను నియంత్రిం చాల్సిన పోలీసు, ఎక్సైజు అధికారులు చూచీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచనపుత్తూరులో బెల్టు షాపులను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

పజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు విశ్రాంతి ఉద్యోగుల భవన నిర్మాణానికి రూ. 50 వేలు విరాళంగా అందించారు. పుత్తూరు లోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం సమావేశం ఆదివారం భాస్కర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం కృషి జనహిత స్వచ్ఛంద సంస్థ రాచపాలెం వారు ఈ సమావేశంలో పాల్గొని ఇన్‌కమ్ టాక్స్, లైఫ్ సర్టిఫికెట్ సమర్పించటం పై వివరించారు. లైఫ్ సర్టిఫికెట్ పై అవగాహనను విజయవంతంగా నిర్వహిం చారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగుల భవనానికి ఆర్థికంగా చేయూత అందించాలని కోరారు. కార్యదర్శి కుప్పయ్య నివేదికను చదివి సమర్పించారు. లైఫ్ సర్టిపికెట్‌ను ఈ సమావేశానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ చేయించారు. సుమారు 100 మందికి లైఫ్ సర్టిఫికెట్‌లు ఇప్పించారు. అనంతరం భోజన వితరణ అలీషా, దేవకృపావర్మ తల్లి జ్ఞాపకార్థం ఇతరులు చేశారు. విజయలక్ష్మి తండ్రి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం విశ్రాంతి భవన నిర్మాణానికి 50వేల రూపాయలు, వెంకటముని 25 వేల రూపాయలు విరాళంగా సంఘం అధ్యక్షుడు భాస్కర్ రాజుకు అందించారు. జీవన ప్రమాణ పత్రాలను అందించిన ఆ సంస్థ ప్రతినిధులు చంగల్ రాజు, భారతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయ ణరెడ్డి, రామలింగం, అరుణాచల రెడ్డి, వెంకటకృష్ణ మనాయుడు, కృపా వర్మ, నిర్మల జయకుమారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



50వేల రూపాయలు విరాళంగా అందిస్తున్న దాతలు

కాపులను ఓటు బ్యాంకుగా చూస్తున్నారు: ఆర్కాట్ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో గడిచిన ఎన్నికలను పరిశీలిస్తే రెండు సామాజిక వర్గాలకు సంబంధించిన వారే ప్రధాన పాత్ర పోషిస్తూ కాపులను ఓటు బ్యాంకు గానే చూస్తున్నారని కాపు నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక జనాభా కలిగిన కాపులు ముఖ్యమంత్రి పీఠాన్ని అలంకరించాలని ఉన్న రెండు సామాజిక వర్గాలకు చెందిన వారే ముఖ్యమంత్రిగా ఉంటున్నారని జనసేన, టిడిపి పొత్తులో భాగంగా మొదటి రెండున్నర సంవత్సరాలు కాపులు ముఖ్యమంత్రిగా ఉండే విధంగా చంద్రబాబును అడగాలన్నారు. కాపునాడు జాతీయ అధ్యక్షులు రమేష్ నాయుడు, కాపునాడు రాష్ట్ర కన్వీనర్ గిద్ద శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాపులను రాజకీయంగా ఎదగనీయకుండా అణచివేస్తున్నారని, జనాభా దామాషా ప్రకారం కాపులకు 80 శాతం సీట్లు తగ్గకుండా రాజకీయ పార్టీలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఉత్తరాంధ్ర రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించాలన్నారు. కాపులకు తగిన ప్రాధాన్యత ఇవ్వని క్రమంలో కాపు, బలిజ, ఒంటరి, తెలగ ప్రజలను చిన్న పార్టీలతో కాపునాడు పొలిటికల్ ఫ్రంట్ గా ఏర్పడి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో బెల్లంకొండ సురేష్ , రాజేంద్ర, రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాపు నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్



అర్చకులకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్న జిజేఎం ట్రస్ట్ అధినేత

అర్చకులకు 'జిజేఎం ట్రస్ట్' సంక్రాంతి కానుకలు పంపిణీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అర్చకులకు జిజేఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో జిజేఎం ట్రస్ట్ అధినేత నూతన వస్త్రాలు, నిత్యావసర సరకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిజేఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న పదేళ్లపాటు నారా చంద్రబాబు నాయుడు పేద, మధ్యతరగతికి కులమతాలకు అతీతంగా సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగల సందర్భంగా ఉచితంగా నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారని తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకాలకు స్వస్తి పలికిందని పేద, మధ్య తరగతి సుఖసంతోషాలతో పండగ జరుపుకొనేలా తమ ట్రస్ట్ ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని 500 మంది అర్చకులకు నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాల ను పంపిణీ చేశామని తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన ఆర్ముగం

ప్రజాశక్తి -కేవిబిపురం: కే వి బి పురం మండలంలోని దిగవ పుత్తూరు గ్రామంలో వుంటున్న ఆర్ముగం(30) పశువులను మేతకోసం తీసుకొని వెళు తుండగా దిగువ పుత్తూరు చెరువులో కాలు ప్రమాద వశాత్తు జారిపడి మృతి చెందాడు. ఆరుముగానికి ఈత రాకపోవడం వల్లే మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా భోగి సంబరాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రజలు ఆదివారం భోగి పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే నిద్రలేచి భోగి మంటలు వేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోను సంక్రాంతి శోభ సంతరించుకొంది. కొత్త దుస్తులు ధరించి, ఒక్కరిక్కరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు రకాల పిండి వంటలు తయారు చేశారు. కొత్త అల్లుళ్ల రాకతో అత్తవాళ్ల ఇల్లులు కళకళలాడాయి. ఇళ్ల ముందు మహిళలు వేసిన రంగవల్లికలు ఆకట్టుకున్నాయి.



పుత్తూరు లో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ చిన్నరాజు కుప్పం ఎస్టీ కాలనీలో భోగి, సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ కౌన్సిలర్ ఎల్లంటి ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు టిడిపి పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, జనరల్ సెక్రెటరీ ఎన్ ఎన్ ధనపాల్, చిత్తూరు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య, చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బాబు నాయుడు, హెచ్ రాము, బివి బాలాజీ, పి.మాధవులనాయుడు, సుబ్రమణ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండలంలో భోగి పండుగను ఇంటింటా ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయం 3గంటల నుండి చిన్నారులు మహిళలు చిన్నపెద్ద తేడా లేకుండా భోగీల వద్ద చలిమంటలు కాంచుకుంటు వీధుల్లో కనబడ్డారు.

రామకుప్పం: మండలంలో భోగి మంటలు వేసి పండుగను ప్రజలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ప్రతి ఒక్కరు తెలుగువారి సాంప్రదాయ దుస్తులు ధరించారు. మహిళలు ఇంటి ముంగిట రంగవల్లులు చెల్లి రంగు,రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పండుగ ఘనంగా జరిపారు.

ప్రతి ఇంట భోగి మంటలు

బంగారుపాళ్యం: మండలంలో భోగి సందర్భంగా ఆదివారం ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. రంగురంగుల ముగ్గులుతో సుందరంగా అలంకరించారు.

చిల్లకూరు: పండగ సందర్భంగా ఈ సంవత్సరం సంక్రాంతి కానుక ప్రజలకు అందించడంలో సమాజంలో ముందున్న రాజినేని రామానాయుడు ట్రస్ట్ చొరవ చేసుకుంటుంది. ఈ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాజనేని శ్రీనివాసులు నాయుడు ప్రతి సంవత్సరం చేయడం మాల. నల్లగారి పాలెం. పార్లపల్లి. తిక్కవర తప్పకుండా పాలెం తదితర గ్రామాల ప్రజలకు సంక్రాంతి సందర్భంగా మహిళలకు చీరలు, పురుషులకు పంచలు టవల్లో వేలు మందికి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వికలాంగులు తమ సమస్యలను, బాధలను శ్రీనివాస నాయుడుకు విన్నవించుకొనగా అన్ని విధాల సహకారం అందిస్తానని, రాజునేని రామానాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తండ్రి పిచ్చయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. గ్రామ పెద్దలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేల మంది సంక్రాంతి కానుక మేళాలో పాల్గొన్నారు.



కార్వేటినగరంలో



మోహన్‌బాబును కలిసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

మోహన్ బాబును కలిసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి- రామచంద్రపురం(చంద్రగిరి): సినీనటుడు, శ్రీ విద్యానికేతన్ విద్యాసంస్థల అధినేత మంచు మోహన్ బాబు, ఆయన కుమారుడు విష్ణులకు తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం బోగి పండుగ సందర్భంగా శ్రీ విద్యా నికేతన్ లోని మోహన్ బాబు ఇంటికి వెళ్లి వారిని శాలువాలతో సత్కరించి పుష్ప గుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత వారి ఆశీస్సులు తీసుకుని కొంత సేపు వారితో ముచ్చటించారు. కొత్త ఏడాది మోహిత్ రెడ్డికి అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో వీరి కలయిక ప్రాముఖ్యతను చాటుకుంది.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: పండుగరోజు పేద కుటుంబాల్లో ఆనందం కోసమే దుస్తులు పంపిణీ చేసినట్లు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి డాక్టర్ థామస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం డాక్టర్ థామస్ చేతులు మీదుగా వెయ్యి మందికి దుస్తులు పంపిణీ చేశారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సంక్రాంతి పండుగ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం అన్నదానం చేశారు. ప్రతి ఏటా తమ చిన్ననాటి స్నేహితులతో కలసి వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషకరంగా ఉందని ఉపాధ్యాయుడు రమేష్ అన్నారు. కార్యక్రమంలో వేలురెడ్డి, భూపాల్, వినాయక, కుమార్, మణి, బంగారయ్య, రమణ, దాము, మణి, బాలాజీ పాల్గొన్నారు.



రాజా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేస్తున్న దృశ్యం

ట్రస్ట్ నిధులతో రోడ్డుకు ప్యాచ్‌వర్క్

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్‌పేటలో రోజా ఛారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహించిన రోడ్డు ప్యాచ్‌వర్కుల పనులకు రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి ఆదివారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఇటీవల మంత్రిని కలసి తెలుపుకున్న మేరకు ఈ పనులను ట్రస్టు ద్వారా చేపడుఉన్నట్లు ఆయన తెలిపారు. రూ.1.60లక్షలతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌ఛైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఈవీ బాలకృష్ణన్, కౌన్సిలర్లు గంగాధరం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని బగళనత్తం గ్రామానికి చెందిన మునస్వామి నాయుడు, కొరారిగడ్డకు చెందిన నారాయణ, బల్ల గ్రామాలకు చెందిన శాంతమ్మ అనే టిడిపి కార్యకర్తలు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు టీడీపీ నేతలు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు.

భోగి మంటల్లో జీవో పత్రాలు దగ్ధం



పుంగనూరులో జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-పుంగనూరు: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల పట్ల ప్రభుత్వ మొండి వ్యతిరేక వైఖరిని భోగి మంటల్లో వేస్తూ నిరసన తెలుపుతున్నట్లు పుంగనూరు యుటిఎఫ్ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, శంకర్ రెడ్డి తెలిపారు. తాము దాచుకున్న డబ్బులు కూడా ఇవ్వకపోవడంతో వారి నిరసన భోగి పండగ పర్వదినాన ఉదయంనే భోగిమంటల్లో ప్రతులను కాల్చి నిరసన తెలిపారు. తమకు రావాల్సిన, దాచుకున్న మాడబ్బులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-రామకుప్పం: వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చీకటి జీవోలను టీడీపీ నేతలు, కార్యకర్తలు భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద భోగిమంటల్లో పత్రాలు వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, సుబ్రీ, సలాం సాబ్ పాల్గొన్నారు.

నాయుడుపేట: టిడిపి పిలుపుమేరకు 'రాష్ట్రానికి వైసిపి కీడు పోవాలి.. మేలు జరగాలి..' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాయుడుపేట టిడిపి కార్యాలయంలో మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం వైసిపి ప్రభుత్వం అక్రమ జీవోలు, ఆనాలోచిత నిర్ణయాలు పత్రాలను ఆదివారం తెల్లవారు జామున భోగి మంటల్లో వేసి తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో భీమవరం గ్రామ సర్పంచ్ అమృత సరళ, నాయుడుపేట మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్ రెడ్డి,తిరుపతి జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు అవధానం.సుధీర్, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మొండెం బాబు, ఐటీడీపి గోపాల్ కృష్ణ పాల్గొన్నారు.

19న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విజయవాడలో ఈనెల 19న ప్రారంభించనున్నారని ఇది అందరి పండుగని విజయవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహావిష్కరణ సందర్భంగా రాష్ట్రమంతా పర్యటించి పిలుపునిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఆదివారం సాయంత్రం తిరుపతి చేరుకుని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఛైర్మన్ మాట్లాడుతూ దాదాపు 200 ఎకరాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల ఎత్తు విగ్రహాన్ని స్మృతి వనాన్ని ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించ నున్నారని ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని అన్నారు. రూ.400 కోట్లతో స్మృతి వనంలో 3000 మంది సీటింగ్ కెపాసిటీతో కన్వెన్షన్ హాల్, రెండు వేల మందికి సరిపడా ఓపెన్ థియేటర్, ధ్యాన మందిరం, గార్డెన్ ఏర్పాటుతో అద్భుతంగా తీర్చిదిద్దారని, పదివేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా లైబ్రరీ ఏర్పాటు వంటివి ఉన్నాయని అన్నారు. ఈ స్మృతి వనం ప్రపంచ పర్యాటక ప్రాంతంగా ఆకట్టుకునే విధంగా అద్భుత కళాఖండాలు ఉన్నాయని తెలిపారు. ఈ విగ్రహం ఈక్వాలిటీ లిబర్టీ నాలెడ్జ్ కు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని పిలుపు నిచ్చారు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి టోర్నమెంట్

ప్రజాశక్తి-పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులు ప్రోత్సహించేందుకు వాల్మీకి మహర్షి టోర్నమెంట్లు నిర్వహిస్తున్నామని విశ్రాంతి డిఎస్పి సుకుమార్ బాబు తెలిపారు. చౌడేపల్లి మండలం కాగతి గ్రామంలో టోర్నమెంటును ఆదివారం ప్రారంభించినట్లు తెలిపారు. టోర్నమెంట్ పోటీలలో 25టీములు పాల్గొంటాయని చెప్పారు. పుంగనూరు మండలానికి చెందిన ఒంటిమిట్ట మేళం దొడ్డి మర్రిమాకులపల్లి పుంగనూరు టౌన్ టీములు పాల్గొంటాయన్నారు. 14 నుండి18 వరకు ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వాల్మీకి కాగతి యూత్, గంపల గంగరాజు, నాగిరెడ్డి, అంజప్ప, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



చర్చిలో పండుగ నిర్వహిస్తున్న పాస్టర్లు

చర్చిలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-నగరి: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగను స్థానిక సీఎస్ఐ ఈస్ట్ పాస్టరేట్ చర్చిలో నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఫాస్టర్ జోనాథన్ లెక్లర్ ఆధ్వర్యంలో చర్చిలో చెరుకుగెడలు, పొంగళి కుండలు ఏర్పాటుచేసి సంక్రాంతి వాతావరణాన్ని తెప్పించారు. అందరికీ మంచి జరగాలంటూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఫాస్టర్ మాట్లాడుతూ పండుగలు మతాలకు అతీతమన్నారు. ప్రతి పండుగ ప్రజలకు ఆనందాన్ని పంచేదిగా ఉండాలన్నారు. ప్రార్ధనల అనంతరం చక్కెర పొంగళి, చెరకు గెడలను అందించారు.

పందెం రాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి-కోట: మండలంలోని నెల్లూరు పల్లి కొత్తపాలెం పంచాయతీ సమీపంలో ఏడు మంది కోడి పందాలు ఆడుతుండగా కోట ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో ఆదివారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో చాకచక్యంగా ఏడు మందిని అరెస్టు చేసి, ఏడు కోళ్లను రూ.6,650 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

మామిడి రైతు గట్టెక్కేనా?

- గత ఏడాది తీవ్ర నష్టం
- ఈ ఏడాది విరబూసిన పూత
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- గిట్టుబాటు ధర కరువు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఈ ఏడాది మామిడి చెట్లలో పూత విరబూసింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత పదేళ్లుగా రైతులు ఎంతో కష్టపడినా పూత పూసి కాయ వచ్చే దశలో ఏదో ఒక కారణంగా విపరీతమైన గాలులతో పూత రాలిపోయి తీవ్ర నష్టం వచ్చేది. ఈ సారి అలాంటి పరిస్థితి కొంత తగ్గి పూత అధికంగా వుండడంతో మామిడి రైతుల్లో ఆశలు రెట్టింపై వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో సుమారు 800 ఎకరాల్లో మామిడిని రైతులు పండిస్తున్నారు. గాజులపెళ్లూరు, కుక్కంబాకం, బిఎన్‌కండ్రిగ, అడిగల కండ్రిగ, కొత్తపాళెం, పివికండ్రిగలలో మామిడి అధికంగా వుంది. సుమారు పదుల సంఖ్యలో రైతులు వున్నారు. వీటి నుంచి వచ్చే తోతాపురి, బంగినిపల్లి, తదితర రకాల మామిడి పళ్లను సమీపంలోని జ్యూస్ ఫ్యాక్టరీకి తరలి స్తుంటారు. అయితే ఈ రెండు రకాల మామిడి పళ్లను మాత్రమే వారు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మిగిలిన రకాల మామిడి పళ్లను రహదారి పక్కనే కూర్చొని అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. వేల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నా టన్నుకు సుమారు 1500 రూపాయలు మాత్రమే గిట్టుబాటు ధర లభిస్తోంది. సుమారు 20 టన్నుల మామిడి ప్రతి సంవత్సరం వస్తోంది. కొనుగోలు చేసేవారు లేక పోవడంతో వందల రూపాయల్లో కూడా ఆదాయం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఏడాది పూత అధికంగా వున్న మామిడి చెట్లు

గత ఏడాది వర్షాలకు తీవ్ర నష్టం

గత ఏడాది వర్షాలకు మామిడి పూత దశలో తీవ్ర నష్టం వచ్చింది. వాటికి తగిన పరిహారం కూడా చెల్లించ లేదు. ఈ సారి పరిస్థితి అలాలేదు. పూత బాగా వుంది. ఈ పూత నిలిచేందుకు అన్ని రకాల మందులు పిచికారీ చేస్తున్నాం. రేయింబవళ్లు తోట వద్దే కాపాలా వుంటు న్నాను. అయినా పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం మామిడికి తగిన గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. నేను మామిడి తోటలో వెయ్యి కోడి పిల్లలను కూడా పెంచుతున్నాను. గత పదేళ్లుగా మామిడి తోటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా ఎలాంటి గిట్టుబాటు ధర రావడంలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.



- రవికుమార్ నాయుడు, రైతు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మండలంలో పండించే మామిడి పండ్లకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. గతంలో ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన పంటకు తగిన నష్టపరిహారం చెల్లించాలి. సుమారు మండలంలో 15 ఎకరాల మామిడి తోటల్లో చెట్లు పడిపోయాయి. వాటికి ఇప్పటికీ నష్టపరిహారం అందలేదు. పెట్టిన వేల రూపాయల పెట్టుబడుల్లో వందల రూపాయలు కూడా రావడం లేదు.

- అజయ్ కుమార్ రెడ్డి , రైతు.







(మొదటిపేజీ తరువాయి)

పల్లెల్లో సంక్రాంతి సందడి


రంగు రంగుల ముగ్గురాళ్లు, చెరకు గడల అమ్మకాలు

తిరుగుతూ డబ్బులు, బియ్యం తీసుకుంటూ వెళ్లగా పిల్లలు అతని వెంట పరుగులు తీశారు. పల్లెల్లోని మహిళలు గొబ్బెమ్మలు అలంకరించి ఇంటింటికీ తిరుగుతూ సామూహికంగా పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. సంక్రాంతి నేపథ్యంలో వ్యాపార సముదాయాలన్నీ సందడిగా మారాయి. వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పండుగలో ప్రాధాన్యత సంతరించునే రంగుల ముగ్గుపిండి, మట్టికుండలు, చెరకుగెడలు, ఇతర అలంకరణ సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలతో ఫ్యాన్సీ దుకాణాలు రద్దీగా ఉన్నాయి. ప్రధాన కొనుగోలు దారులతో సందడిగా మారింది.


కిటికిటలాడుతున్న వస్త్ర దుకాణాలు



